క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

పెండ్లిమర్రి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

జమ్మలమడుగు : 13వ వార్డులో సోమవారం సాయంత్రం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మలు పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణ

పులివెందుల టౌన్ : సత్యసాయి సేవాసంస్థలు, బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సేవాసమితి కన్వీనర్ జి.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కుట్టు శిక్షణకు ఎటువంటి విద్యార్హతలు అవసరంలేదన్నారు. 19 ఏళ్ల వయసు నుంచి 40 ఏళ్ల లోపు వయసున్న మహిళలు అర్హులన్నారు. శిక్షణ తరగతులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయన్నారు. ఈనెల 16వ తేదీ లోపు స్థానిక పాతమార్కెట్ సాయిబాబా ఆలయంలో ఆధార్ జిరాక్స్, 2 ఫొటోలు ఇచ్చి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9440979823 నంబరును సంప్రదించాలన్నారు.

సంక్రాంతికి ముగ్గుల పోటీలు

జమ్మలమడుగు : సంక్రాంతి పండుగ గురించి నేటి యువతీ యువకులకు వివరించాలని జన విజ్ఞానవేదిక, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువతీ యువకులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు డేవిడ్‌రాజ్, రాఘవేంద్రలు తెలిపారు. ఆదివారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలతోపాటు పండుగ విశిష్టతను వివరించడం కోసం పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో పాల్గొనే వారు ఈనెల11వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పోటీలలో పాల్గొనే వారికి రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఆట స్థలంలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు 9502494474 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవచ్చు అని సూచించారు. పోటీలలో గెలిచిన వారికి బహుమతులు ఉంటాయన్నారు.

ముస్లింల సంక్షేమానికి నిరంతర కృషి

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పేద, మధ్యతరగతి ముస్లింల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఖాజామొహిద్దీన్ తెలిపారు. స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని వాసవీ సర్కిల్ సమీపంలో ఉన్న ఖాజీ హబీబుల్లా సాహెబ్ మదరసా ఆవరణలో ఆదివారం సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి పట్టణంలోని అన్ని వర్గాల్లో ఉన్న ముస్లింలను కలిసి 14 ఆశయాలు, ఉద్దేశాలతో సంఘ నిర్మాణం జరిగిందన్నారు. న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపార వేత్తలు, మేధావులు, ఇతరులను కలిశామన్నారు. 45 విభాగాలుగా విభజించి ప్రతి విభాగం నుంచి ఇద్దరు చొప్పున ప్రతినిధులను సంఘంలో ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తద్వారా ముస్లిం సమాజంలోని అన్ని వర్గాల నుంచి సహాయ సహకారాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ ఫరీద్‌బాషా, కోశాధికారి జమాలుద్దీన్, న్యాయవాది షకీల్ అహ్మద్, వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

పంచాయతీలలో పారిశుధ్యానికి ప్రాధాన్యత


నాడు పెద్దజూటూరులో అధ్వానంగా ఉన్న వీధి


నేడు అండర్ డ్రైనేజీతో అందంగా తయారైన వీధి

- గ్రామాల్లో పాడా నిధులతో డ్రైనేజీ పనులు
- అండర్ డ్రైనేజీతో ఆదర్శంగా పంచాయతీలు

వేముల : పులివెందుల నియోజకవర్గంలోని పంచాయతీలలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. పంచాయతీలను ఆదర్శంగా ఉంచాలనే ఉద్దేశ్యంతో పాడా నిధులతో డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. గ్రామాల్లో అండర్ డ్రైనేజీ నిర్మించడంతో వీధులన్నీ పరిశుభ్రంగా తయారవుతున్నాయి. మండలంలోని పంచాయతీలలో గతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. మురికి నీరు రోడ్లపై ప్రవహించడంతో వీధులన్నీ మురికి కూపాలుగా మారి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు జ్వరాలబారిన పడుతుండేవారు. గతంలో సిమెంటు రోడ్లకు ఇరువైపులా వేసిన డ్రైనేజీ కాలువలు పూడికతో నిండిపోయి డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. దీంతో ఇప్పుడు పాడా నిధులతో గ్రామాల్లో అండర్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. వేముల మండలంలోని పెద్దజూటూరు, కొండ్రెడ్డిపల్లె, నారేపల్లె, బచ్చయ్యగారిపల్లె గ్రామాల్లో, సింహాద్రిపురం మండలంలోని బి.కొత్తపల్లె, పైడిపాలెం గ్రామాల్లో అండర్ డ్రైనేజీ పనులకు రూ.3.50 కోట్ల మేర పాడా నిధులను వెచ్చించారు. దీంతో పంచాయతీలలో రోడ్లన్నీ పరిశుభ్రంగా మారాయి. గ్రామాల్లో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులకు ప్రజలు కూడా సహకరించడంతో సకాలంలో పనులు పూర్తి చేశారు. అలాగే మండలంలోని చింతలజూటూరు, వేల్పుల, చాగలేరు, బెస్తవారిపల్లె, పెర్నపాడు, నల్లచెరువుపల్లె, గొందిపల్లె గ్రామాల్లో అండర్ డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు వెళ్లాయి. పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే అండర్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు.

అండర్ డ్రైనేజీ వ్యవస్థతో ఆదర్శంగా పంచాయతీలు :



మండలంలోని అన్ని పంచాయతీలలో పాడా నిధులతో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం కొన్ని పంచాయతీలకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. పంచాయతీలలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇచ్చి పనులు చేస్తున్నాం.

– శివారెడ్డి(ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ), వేముల

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం : అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని చవ్వారిపల్లె గ్రామంలో ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారని.. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల జీవితాలలో సంక్షేమ వెలుగులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నెడ్ క్యాప్ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి, రాష్ట్ర ఆరి కల్చర్ మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారకనాథ్‌డ్డి, కిషోర్‌రెడ్డి, సూర్యశేఖరరెడ్డి, మహేశ్వరరెడ్డి, సుధాకరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జి.ద్వారకనాథ్‌రెడ్డి, శ్రీధర్‌నాథ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నిర్మించాలి

కొండాపురం : గండికోట ప్రాజెక్టులో ముంపునకు గురికాకుండా మిగిలిన 29 పడమటి గ్రామాల రైతాంగానికి సాగునీరు అందించేందుకు బెడుదూరు సమీపంలోని కొండకు చిన్న రిజర్వాయర్ నిర్మించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గతంలో ఈ రిజర్వాయర్ నిర్మించాలని ప్రతిపాదన కూడా చేయడం జరిగిందన్నారు. గండికోట ప్రాజెక్టులో 26 టీఎంసీలు నీళ్లు ఉన్నప్పటికీ కొండాపురం మండల రైతాంగానికి ఉపయోగంలేదని దిగువ ప్రాంతాల రైతులకోసం తమ భూములను వదులుకుని గ్రామాలను ఖాళీ చేయడం జరిగింది. కొండాపురం మండలంలో పడమటి గ్రామాలైన బెడుదూరు, బురుజుపల్లె, యనమలచింతల, కొత్తపల్లె, కొట్టాలపల్లె, కోనవారిపల్లె, ఉస్తికాయలపల్లె గ్రామాలకు చిన్న రిజర్వాయర్ నిర్మిస్తే రైతాంగానికి సాగునీరు అందించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

విందుకు హాజరైన ప్రజాప్రతినిధులు


విందు కార్యక్రమానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్

కమలాపురం : పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మైనార్టీ రాష్ట్ర విజిలెన్స్ కమిషన్ మెంబర్ సయ్యద్ హిదాయతుల్లా నివాసంలో జరిగిన విందుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. హిదాయతుల్లా ఇటీవల కమిషన్ మెంబర్‌గా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన ఈ విందుకు వీరితో పాటు, ఉద్యానశాఖ రాష్ట్ర సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ విజిలెన్స్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్, ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా ప్రతాప్‌రెడ్డి, సింగసాని గురమోహన్, స్థానిక నాయకులు హాజరయ్యారు.

ఐకమత్యంతోనే గౌడ సంఘం అభివృద్ధి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ వరప్రసాదు, సంఘం అధ్యక్షుడు తదితరులు

పులివెందుల రూరల్ : ఐకమత్యంతోనే (ఈడిగ) గౌడ సంఘం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాదు అన్నారు. ఆదివారం పట్టణంలోని శివసాయి కల్యాణ మండపంలో (ఈడిగ)గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గౌడ సంఘంలోని సభ్యులంతా ఐకమత్యంతో ఏదైనా సాధించగలరన్నారు. రాష్ట్రంలో బీసీల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొండయ్యాగౌడ్, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణగౌడ్, గౌరవ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్యగౌడ్, జయకృష్ణగౌడ్, మురళీనాథ్‌గౌడ్, కాటమయ్యగౌడ్, సుండుపల్లె జెడ్పీటీసీ రెడ్డమ్మ, అనంతపురం జిల్లా గౌడ్ సంఘం నాయకులు, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కను విందు చేస్తున్న పులివెందుల


రాత్రి వెలుగులలో కదిరి రింగ్‌రోడ్డు


రాత్రి సమయంలో రాయలాపురం బ్రిడ్జి


వైఎస్సార్ మెమోరియల్ పార్కులో ఏర్పాటు చేసిన నిర్మాణం


నూతన హంగులతో రూపుదిద్దుకున్న ఆర్టీసీ బస్టాండ్

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం అభివృద్ధిలో భాగంగా కొత్త అందాలను సంతరించుకుని కనువిందు చేస్తోంది. ముద్దనూరు రోడ్డులో సుమారు రూ.35 కోట్లతో మోడల్ ఆర్టీసీ బస్టాండ్, రూ.7 కోట్లతో రాయలాపురం బ్రిడ్జి, అలాగే శ్రీరంగనాథ్‌స్వామి ఆలయ సమీపంలో రూ.4.29 కోట్ల వ్యయంతో వైఎస్సార్ మెమోరియల్ పార్కు, అలాగే పట్టణం చుట్టూ ఏర్పాటు చేసిన రింగ్ రోడ్డు ఎంతో అందంగా రూపుదిద్దుకున్నాయి. అలాగే మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల పేర్లు, ఆయన చేసిన పాదయాత్రను గుర్తు చేసుకునేలా రింగ్ రోడ్డు చుట్టు ప్రధాన కూడళ్లలో విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి పులివెందులకు వచ్చే వారిని అవి ఆకట్టుకుంటున్నాయి.

12న హిందూ ఉపాధ్యాయ సమితి మహాసభలు

ప్రొద్దుటూరు : గుంటూరులోని హిందూ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో ఈనెల 12న హిందూ ఉపాధ్యాయ స మి తి తృతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్, స్వామి వివేకానంద సేవా సమితి సభ్యులు మల్లికార్జునరావు, చలపతి, మోహన్ పే ర్కొన్నారు. స్థానిక గీతాశ్రమంలోని విశ్వ హిందూ పరిషత్, స్వామి వివేకానంద కార్యాలయంలో ఆదివారం ఆ మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన విలువలను కాపాడేందుకు హిందూ ఉపాధ్యాయ సమితి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మన దేశ సంస్కృతి కాపాడేలా ఈ సమితి కృషి చేస్తోందన్నారు. హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర కార్యదర్శి కుంటుమల్ల రామగోపాల్ మాట్లాడుతూ ఈ మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆడపిల్లలు దేవుడిచ్చిన వరం

ప్రొద్దుటూరు క్రైం : ఆడపిల్లలు జన్మించడం దేవుడిచ్చిన వరమని కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బద్వేలి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుడ్డాయపల్లెలోని బీసీ బాలికల హాస్టల్‌లో ఆదివారం పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేయడం, చేయించుకోవడం నేరమని చెప్పారు. సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యులకు, చుట్టు పక్కలనున్న సన్నిహితులకు అవగాహన కల్పించాలని బాలికలను కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం


డ్రైనేజీ పనలను పరిశీలిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్‌లు

చెన్నూరు : చెన్నూరు టౌన్ గ్రామ సచివాలయం–2 పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద డ్రైనేజీ పనులను ఆదివారం సర్పంచ్ సిద్దిగారి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఎంపీటీసీ ముదిరెడ్డి సుబ్బారెడ్డి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రూ.5 లక్షలు డ్రైనేజీ పనులకు కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జుమన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

పోరాట పటిమ అవసరం

పులివెందుల రూరల్ : జీవితంలో నేటి యువతకు పోరాట పటిమ అవసరమని షార్ట్‌ఫిలిమ్ డైరెక్టర్ గౌస్ అన్నారు. ఆదివారం పార్నపల్లె రోడ్డులోని బీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో షార్ట్ ఫిలిమ్ ప్రీ రీలిజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవడం మానాలని, పోరాడి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. యువత, రైతుల్లో స్ఫూర్తిని నింపే విధంగా తన షార్ట్ ఫిలిమ్ ఉంటుందన్నారు.

శ్రీ వాసవాంబకు విశేష వ్రత పూజలు


వాసవీ కన్యకా పరమేశ్వరీదేవికి పుష్పయాగం


ఆలయంలో వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : ఆర్యవైశ్యులకు ఆరాధ్యదైవమైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారికి ఆదివారం కడప నగరంలోని అమ్మవారిశాలలో విశేష వ్రత పూజలను సమర్పించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీ వాసవీ మాలను ధరించిన భక్తులు వ్రతం మగింపు దగ్గర పడుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా తొలుత అమ్మవారి మూలమూర్తితోపాటు ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించి కనుల పండువగా సువర్ణ చేలంతో అలంకరించారు. కనుల పండువగా అలంకరించిన వేదికపై కొలువుదీర్చారు. అమ్మవారిని వివిధ రకాల పండ్లతోనూ, వెనుక గల తెరను చెరుకు గడలతోనూ అలంకరించడం విశేషం. మాలధారులైన భక్తులు తమ కుటుంబ సభ్యులతో హాజరై అమ్మవారి సన్నిధిలో వాసవాంబ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కుంకుమార్చన అనంతరం నివేదన చేసి భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.